ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

ఆదివారం 4 ఆగస్టు 2024

అన్నదాతకు ధీ(బీ)మా



- కొత్త మార్గదర్శకాలతో దరఖాస్తులకు మరో ఛాన్స్
- ఆగస్టు 5వ తేదీ వరకు అవకాశం
- మార్పులుచేర్పులకు 30వ తేదీ వరకు గడువు
- జిల్లాలో 2023-24లో నమోదైన రైతులు 77,992 మంది

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

రైతు బీమా అన్నదాతల కుటుంబాలకు ధీమాగా నిలుస్తోంది. తెలంగాణలో గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు బీమా పథకంలో 2024-25 సంవత్సరానికి భూమినే నమ్ముకొని జీవనం సాగించే రైతులకు ఏడోసారి బీమా నమోదు ప్రక్రియ కొత్త మార్గదర్శకాలతో మొదలుపెట్టారు. ఈ సంవత్సరం జూన్ 28 వరకు పట్టా పాస్‌బుక్ పొందిన రైతులు బీమాకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవడానికి చివరి గడువుగా నిర్ణయించారు. దీనికి తోడు గతంలో దరఖాస్తులు చేసుకున్న రైతులు ఆధార్, బ్యాంక్ ఖాతాల్లో నమోదు, నామినీ చనిపోతే పేరు మార్పు వంటివి ఆగస్టు 30వ తేదీ వరకు చేసుకునే వీలు కల్పించారు. వ్యవసాయ భూమిని ధరణిలో పట్టా చేయించుకున్న 18 నుంచి 59 ఏళ్ల రైతులు ఈ బీమా పథకానికి అర్హులుగా నిర్ణయించారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్, నామినీ, ఆధార్, జిరాక్స్ పత్రాలను ఏఈవోలకు అందించాలి. వ్యవసాయ శాఖ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి సంబంధిత రైతుల వివరాలను నమోదు చేయాలి. 14.8.1965 నుంచి 14.8.2006 వరకు జన్మించిన రైతులు అర్హులుగా ఉంటారు. ఎల్‌ఐసీ ద్వారా అందించే బీమాను ఈసారి కొత్త పట్టాదారులు, పోడు భూములు హక్కులు పొందిన యజమానులు కూడా నమోదుకు అవకాశం ఉంది.

● జిల్లాలో 2,286 మంది కుటుంబాలకు బీమా సాయం

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2018 నుంచి ఇప్పటివరకు బీమా పథకంలో రైతులు నమోదవుతూ వస్తున్నారు. 2023-24 సంవత్సరంలో 77,992 మంది రైతులు నమోదయ్యారు. ఈసారి కొత్తగా ఆరు వేల మంది రైతులు నమోదయ్యే అవకాశం ఉంది. జిల్లాలో ఇప్పటివరకు రైతు బీమా ద్వారా 2,286 మంది రైతు కుటుంబాలు బీమా సాయాన్ని పొందారు. 2018లో 317 మంది, 2019లో 337 మంది, 2020లో 536 మంది, 2021లో 387 మంది, 2022లో 376మంది, 2023లో 333 మంది, రైతులు చనిపోగా వారి కుటుంబాలు బీమా సాయాన్ని పొందారు. దాదాపు ఇప్పటివరకు 114.30 కోట్ల రూపాయల వరకు బీమా సాయాన్ని పొందారు. కొత్తగా బీమా దరఖాస్తులు చేసుకునే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

బీమాను సద్వినియోగం చేసుకోవాలి...

- భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి



ప్రభుత్వం కల్పిస్తున్న బీమా సౌకర్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఏదైనా కారణం చేత రైతు చనిపోతే ఆ కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు బీమా పరిహారం లభిస్తుంది. ఏఈవోలకు ధ్రువ పత్రాలు అందించి ఆగస్టు 5లోగా దరఖాస్తులు చేసుకోవాలి. 59 ఏళ్ల మధ్య వయస్సు వారు బీమా పథకానికి అర్హులు.

'ధరణి' దరఖాస్తులను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 3: ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో శనివారం రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లతో ధరణి పెండింగ్ దరఖాస్తుల పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకన్నారు. పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 3: జిల్లాలో పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటుందని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో శనివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి కమిషనర్ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో వీడియో కాన్ఫరెన్స్‌లో పెండింగ్ భూ సమస్యల పరిష్కారంపై సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేసిన తర్వాత సంబంధిత దరఖాస్తుల ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసి పరిష్కరించాలని సూచించారు ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లును రూపొందించి ప్రజలకు అందుబాటులో ఆన్‌లైన్‌లో పెట్టిందని అన్నారు. నూతన చట్టం ముసాయిదా కింద కొత్త ఆర్వోర్ రికార్డుల రూపకల్పన, అందుబాటులో ఉన్న రికార్డుల సవరణకు అవకాశం ఉందన్నారు. ఆర్వోఆర్ ముసాయిదా బిల్లుపై ప్రజలు తమ సలహాలు సందేహాలు, అభిప్రాయాలను మెయిల్ ద్వారా ఆగస్టు 23 వరకు తెలియజేయాలని కోరారు. జిల్లాలో అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారులు నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లును పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఉన్న భూసమస్యల పరిష్కారానికి అవసరమైన సలహాలు సూచనలు సకాలంలో అందించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు సలహాలు మేరకు కొత్త చట్టాన్ని ప్రభుత్వం రూపొందిస్తుందని అన్నారు. నూతన ఆర్వోఆర్ చట్టం అమలులోకి వచ్చే లోపు పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని, మరో మూడు వారాల్లో పూర్తి స్థాయిలో ధరణి దరఖాస్తులు పరిష్కారమయ్యే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. ధరణి ద్వారా వచ్చిన దరఖాస్తులను తిరస్కరించే పక్షంలో తప్పనిసరిగా కారణాలను తెలియజేయాలని అధికారులకు సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో ధరణి ద్వారా మొత్తం 3,240 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో ఇప్పటివరకు 737 దరఖాస్తులను ఆమోదించామని, 2,501 దరఖాస్తులను తిరస్కరించామని తెలిపారు. ప్రస్తుతం 969 ధరణి దరఖాస్తుల పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కలెక్టర్ వద్ద 114 దరఖాస్తులు, అదనపు కలెక్టర్ వద్ద 318 దరఖాస్తులు, రెవెన్యూ డివిజన్ అధికారుల వద్ద 327 దరఖాస్తులు, తహసీల్దార్ల వద్ద 210 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వీటిని సకాలంలో పరిష్కరిస్తామని, తిరస్కరించే దరఖాస్తులపై తప్పనిసరిగా కారణం తెలియజేస్తామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, మండలాల నుంచి తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో నలుగురికి గాయాలు

చందుర్తి, ఆగస్టు 3: ఓ పిచ్చికుక్క దాడిలో నలుగురు వ్యక్తులకు గాయాలైన ఘటన చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన శ్రీకాంత్, మల్లవ్వ, లక్ష్మి, రాములు వారి ఇళ్ల ముందు ఆరుబయట నిలిచి ఉండగా వారిపై ఓ పిచ్చి కుక్క దాడి చేసి గాయపరిచింది. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం 108 సిబ్బందికి సమాచారం అందించి, వేములవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

దుబాయ్‌లో వీసా క్షమాభిక్ష పథకం

- సెప్టెంబరు 1న ప్రారంభం - ప్రవాస కార్మికులకు ఊరట

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 3: దుబాయ్‌లో వీసా క్షమాభిక్ష కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్లు శనివారం యూఏఈ ప్రకటించింది. దుబాయ్, షార్జా, బార్ దుబాయ్ తదితర గల్ఫ్ ప్రాంతంలో రెండు నెలల వీసా క్షమాభిక్షను సెప్టెంబరు 1వ తేదీ నుంచి ప్రారంభిస్తామని యూఏఈ పేర్కొంది. ఈ సమయంలో నిబంధనలు ఉల్లంఘించి అక్కడే ఉంటున్న ప్రవాస కార్మికులు వీసా స్థితిని క్రమబద్ధీకరించుకునే అవకాశం ఏర్పడింది. యూఏఈలో ఆరు సంవత్సరాల క్రితం ఆగస్టు 1, 2018న మూడో రెసిడెన్సీ క్షమాభిక్ష పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం వల్ల వేలాదిమంది ప్రవాస కార్మికులకు ఉపయోగపడింది. యూఏఈలో రెసిడెన్సీ నిబంధనలు ఉల్లంఘించిన అనేకమంది కార్మికులు తమ స్థితిని సరిదిద్దుకొని స్వదేశానికి తరలివచ్చారు. చాలాకాలంగా వీసా నిబంధనలు ఉల్లంఘించి యూఏఈలో ఉంటున్న ప్రవాసకార్మికులు తిరిగి స్వదేశానికి వచ్చి తమ కుటుంబసభ్యులను కలుసుకునే అవకాశం ఏర్పడింది. మళ్లీ ఈ పథకం అమలు చేస్తున్నట్లు యూఏఈ ప్రకటించడంతో ప్రవాసకార్మికుల కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతుంది.

ఆర్టీసీ బస్సుల్లో సురక్షితమైన ప్రయాణం



బహుమతులు అందజేస్తున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వేములవాడ టౌన్, ఆగస్టు 3: ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షితమైన ప్రయాణం సాధ్యమవుతుందని ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి అన్నారు. వేములవాడ ఆర్టీసీ డిపోలో శనివారం డీలక్స్ బస్సులో ప్రయాణించిన మహిళలకు లక్కీ డ్రాను ఏఎస్పీ చేతుల మీదుగా తీశారు. ఈ సందర్భంగా లక్కీ డ్రాలో మొదటి బహుమతిని వేములవాడకు చెందిన రేగూరి సుజాత, రెండో బహుమతి హైదరాబాద్‌కు చెందిన అఖిలకు, మూడో బహుమతి వేములవాడకు చెందిన రమ్య గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విశాల షాపింగ్‌మాల్ ఆధ్వర్యంలో చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ డీలక్స్ బస్సులో ప్రయాణించే మహిళలు తమ టికెట్‌పైన వారి పేరు ఫోన్ నంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన లక్కీడిప్‌లో వేయాలన్నారు. 15 రోజులకు ఒకసారి డ్రా తీసి బహుమతులను ఆర్టీసీ వారు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాస్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, పీఆర్వో శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి రూ. 50 కోట్లు

- ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతాం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 3: రాష్ట్ర బడ్జెట్‌లో వేములవాడ రాజన్న ఆలయానికి 50 కోట్ల రూపాయలు కేటాయించమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాజన్న ఆలయానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు తమ తప్పును ఒప్పుకుని, క్షమాపణ చెబుతూ అదే స్థలంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేయాలన్నారు. మేము ఎప్పుడు రాజన్న ఆలయానికి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని చెప్పలేదని, రాజన్న ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని చెప్పామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా రూ. 100 కోట్లు కేటాయిస్తామని చెప్పి వేములవాడ ప్రజలను, భక్తులను మోసం చేశారని గుర్తు చేశారు. బడ్జెట్‌లో రాజన్న ఆలయానికి నిధులు కేటాయించలేదని పిచ్చికూతలు కూసిన బీఆర్ఎస్, బీజేపీ నేతలు బడ్జెట్ బుక్‌ను చూడాలని, అందులో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారటీ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి గానూ 50 కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లు చూపామని గర్వంగా చెప్పుతున్నామన్నారు. మిడిమిడి జ్ఞానంతో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపిన నేతలు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు క్షీరాభిషేకం చేయాలని హితవు పలికారు. వీటీడీఏ పరిధిలో అప్పటి ప్రభుత్వం ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదని, ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలలోనే సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం ఏర్పాటు చేసి 20 కోట్ల రూపాయల నిధులను తిరిగి తీసుకువచ్చిన ఘనత మాదేనని స్పష్టం చేశారు. నియోజకవర్గానికి 2023-24 సంవత్సరానికి గాను విడుదలైన రూ. 150 కోట్ల నిధులను వెంటనే మంజూరు చేయాలని వీడియో విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎందుకు ఆ నిధులు తీసుకురాలేదని ప్రశ్నించారు. రంగు రంగుల బ్రౌచర్‌లు సృష్టించి భక్తులను, ప్రజలను మోసం చేయదలుచుకోలేదని, రాజన్న ఆలయం, పట్టణాభివృద్ధి చేసి చూపిస్తామని తెలిపారు. పట్టణంలోని రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. పది సంవత్సరాలు అధికారంలో వున్న బీఆర్ఎస్ ప్రభుత్వం బ్రిడ్జి పనులకు ఇప్పటి వరకు ల్యాండ్ అక్వ్యూవేషన్ చేయలేదన్నారు. సంవత్సరం కాకముందే రైతు రుణమాఫీ అమలు చేసి దేశం తెలంగాణ వైపు చూసేలా చేశామన్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌కు వస్తున్న ప్రజాధరణతో ఓర్వలేక కారుకూతలు కూస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వేములవాడకు వచ్చిన ప్రదాని మోదీ రాజన్న ఆలయానికి ఏమి ఇవ్వలేదని, ప్రసాద్ స్కీమ్‌లో ఒక్కపైసా ఇవ్వలేదని, అట్లాంటి మీరు నిధులు కేటాయించలేదని దిష్టిబొమ్మలు దహనం చేయడం ఏంటని ప్రశ్నించారు. గత ప్రభుత్వ నేతల తీరుతో నష్టపోయిన ఈ ప్రాంతాన్ని నిలబెట్టేందుకు తన శాయశక్తులా కృషి చేస్తున్నాని తెలిపారు. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి చూపిస్తానని అన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, నాయకులు కనికరపు రాకేష్, సంద్రగిరి శ్రీనివాస్, సాగరం వెంకటస్వామి, పాత సత్యలక్ష్మి, చిలుక రమేష్, పుల్కం రాజు, గూడూరి మధు, ఇప్పపూల అజయ్, అన్నారం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించిన జిల్లా అధికారులు

వేములవాడ టౌన్, ఆగస్టు 3: వేములవాడ ప్రాతీయ ఆసుపత్రిని జిల్లా సూపరింటెండెంట్ పెంచలయ్య, జిల్లా వైద్యాధికారి వసంత్‌కుమార్ సందర్శించారు. శనివారం ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి తెలుసుకుని పలు విభాగాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలను అందించారు. ఆసుపత్రిలోని వున్న పాలేటివ్ కేర్, డిస్టిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్స్ సెంటర్ సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా అధికారులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్‌చారి పూల మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట డాక్టర్లు సుభాషిని, తిరుపతి, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలను పాడుచేసుకోవద్దు

ఇల్లంతకుంట, ఆగస్టు 3: యువకులు వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలను పాడుచేసుకోవద్దని ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తున్నందున సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైన అసాంఘిక కార్యకలాపాలు జరిగినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మండలంలో ఇప్పటికే గంజాయిని తాగిన వారిపై కేసులు నమోదుచేసి జైలుకు పంపించామని తెలిపారు. ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక బృందాలు

- ప్రక్రియను 2025 మార్చిలోగా పూర్తిచేయాలి - వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం 'భట్టి'



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 3: ప్రభుత్వం చేపట్టిన నాన్ లేఅవుట్ భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ మార్చి 2025 నాటికి పూర్తయ్యే విధంగా జిల్లా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించా రు. సిరిసిల్ల కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో పాటు రెవెన్యూ అధికారులతో ఎల్‌ఆర్‌ఎస్ పథకం కింద వచ్చిన దరఖాస్తులు, వాటి ప్రస్తుత స్థితిగతులు, ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేసేందుకు నిర్దేశించుకున్న ప్రణాళిక మొదలగు వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించడంతో పాటు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల స్క్రూటినీ సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సపోర్ట్ సిస్టం అధికారులకు పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. 2020 నాటి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై ప్రజలకు ఇబ్బంది లేకుండా, ప్రభుత్వానికి నష్టం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ద్వారా ఎక్కడ ప్రభుత్వ భూమికి నష్టం కలగవద్దని, అదే విధంగా నీటి వనరులు, కాలువలు చెరువుల ఆక్ర మణలకు పాల్పడవద్దని అధికారులకు సూచించారు.

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల స్క్రూటినీ కోసం కలెక్టర్లు వారి పరిధిలోని ప్రతి గ్రామానికి, మున్సిపాలిటీకి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లు వివరాలు సమర్పించాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ధ్రువీకరణ కోసం ఆగస్టు మొదటి వారం నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి రాబోయే మూడు నెలల వ్యవధిలో ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తిచేయాలని ఆదేశించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ఫీల్డ్ లెవెల్ వెరిఫికేషన్ సజావుగా నిర్వహించేందుకు బృందాలకు అవసరమైన శిక్షణ అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్, మున్సిపాలిటీ, అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయాల్లో ఎల్‌ఆర్‌ఎస్ సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ సంబంధించి జిల్లా, మండల, మున్సిపల్ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించే దరఖాస్తుదారులకు ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వివరించాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కింద ఉన్న దరఖాస్తులను మార్చి 2025 నాటికి పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఆ దిశగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీపీవో వీరబుచ్చయ్య, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం

తిమ్మాపూర్, ఆగస్టు3: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల శ్రీ తాపాల లక్ష్మినరసింహ స్వామి ఆలయ ఆవరణలో శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరునగరి వెంకటాద్రి ఆధ్వర్యంలో జరుగగా ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు వింజమూరి సుధాకర్ పాల్గొన్నారు. అర్చకుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గల్ఫ్‌లో మల్లారెడ్డిపేట వాసి మృతి

● దుబాయ్‌లో పనిలేక ఆర్థిక ఇబ్బందులు
● స్వగ్రామానికి మృతదేహం

గంభీరావుపేట, ఆగస్టు 3: మండలంలోని మల్లారెడ్డిపేటకు చెందిన గెరిగంటి అంజయ్య(55) దుబాయిలో 45 రోజుల క్రితం మృతి చెందాడు. మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరింది. ఆరేళ్ల కిందట కూతురు పెళ్లి చేసిన అంజయ్య అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చేందుకు అంజయ్య దుబాయి వెళ్లి ఓ కంపెనీలో పనికి కుదిరాడు. కొద్ది రోజులకే ఆ కంపెనీ మూసివేయడంతో రోడ్డున పడ్డాడు. అక్కడ పనిలేక, అప్పులు తీర్చే మార్గం లేక మానసిక ఆందోళనకు గురయ్యాడు. చేద్దామంటే పనిలేక ఎవరూ పట్టించుకోకపోవడంతో దొరికిన నాడు తింటూ దొరకని నాడు పస్తులుంటూ వచ్చాడు. దీంతో సరిగ్గా ఆహారం లేక అనారోగ్యం పాలయ్యాడు. రోజురోజుకు గల్ఫ్‌లో అంజయ్య ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. చివరికి ఫుట్‌పాత్‌పైనే అంజయ్య తుదిశ్వాస విడిచాడు. పాస్‌పోర్ట్ కంపెనీ యాజమాన్య వద్దే ఉండిపోవడంతో మృతదేహం స్వదేశానికి తీసుకురావడానికి ఇబ్బంది ఏర్పడింది.

స్థానిక నాయకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందిం చిన ఆయన ఇండియన్ ఎంబసీ లెటర్ పంపించడంతో గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి చొరవతో శనివారం అంజయ్య మృతదేహం స్వగ్రామమైన మల్లారెడ్డిపేటకు చేరింది. అంజయ్య మృతదేహం ఇంటికి చేరగానే భార్య, వారి బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య, కూతురు ఉంది.



అంజయ్య (ఫైల్)

వెల్దిలో జిలిటెన్ స్టిక్స్ పట్టివేత

మానకొండూర్, ఆగస్టు 3: అక్రమంగా తరలిస్తున్న జిలిటెన్ స్టిక్స్‌ను వెల్ది గ్రామంలో పట్టుకున్నట్లు సీఐ సదన్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కొరిటికల్ గ్రామానికి చెందిన ఒర్సు శ్రీనివాస్ అనే వ్యక్తి కొంతకాలంగా వీణవంక మండల కేంద్రంలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం వీణవంక నుంచి మండలంలోని వెల్ది గ్రామానికి 200 జిలిటెన్‌స్టిక్స్‌ను తరలిస్తున్నాడు. వాహనాల తనిఖీలో పట్టుకుని విచారించగా శంకరపట్నం మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన వంగ సత్యనారాయణ, హుజూరాబాద్ మండలంలోని ఇప్పల నర్సింగాపూర్‌కు చెందిన జున్నోజు రాజేందర్‌ల వద్ద వాటిని కొనుగోలు చేసినట్లు శ్రీనివాస్ తెలిపాడని తెలిపారు.ఈ సంఘటనలో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, రామడుగు, బోయినపల్లి, ఆగస్టు 3: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టులోకి 8,355 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, ప్రాజెక్టు నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరు రిజర్వాయర్‌లోకి నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఇప్పటి వరకు 8.5 టీఎంసీల నీటిని మిడ్‌మానేరుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.125 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 12600 క్యూసెక్కులు, మానేరు, ములవాగు ద్వారా 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.5 టీఎంసీలకు ప్రస్తుతం 14.347 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.



రామడుగు వద్ద నిండుగా ప్రవహిస్తున్న గ్రావిటీ కెనాల్

శనివారం రాత్రి వరకు ఎస్సారెస్పీలోకి 17,925 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 43.091 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1 నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 37.352 టీఎంసీల నీరు వచ్చి చేరింది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 3: సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్‌కు చెందిన నందగిరి రాజశేఖర్ (31) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో గల ఓ లాడ్జ్‌లో శుక్రవారం రాత్రి రాజశేఖర్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోనరావుపేట మండలంలోని పల్లిమక్తకు చెందిన రాజశేఖర్ కుటుంబం ఉపాధికోసం సిరిసిల్లకు వలసవచ్చారు. సిరిసిల్లలోని గీతానగర్‌లో నివాసం ఉన్న రాజశేఖర్ తండ్రి గతంలోనే మృతిచెందాడు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో గల ఓ కంపెనీలో రాజశేఖర్ ఎనిమిదేళ్లుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేశాడు. కొంత కాలంగా నెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న రాజశేఖర్ దాదాపు రూ.40లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. రెండు నెలల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసిన రాజశేఖర్ అప్పులపాలు కావడంతో మనస్థాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడని మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మృతుడి తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియల కోసం మృతుడి అమ్మమ్మ స్వగ్రామమైన తంగళ్లపల్లి మండలంలోని తాడూరు గ్రామానికి తరలించారు.

ఖనిలో ఆంబోతుల వీరంగం

● టీవీ షోరూంలోకి దూసుకెళ్లిన ఎద్దులు



గోదావరిఖని లక్ష్మీనగర్‌లో పొట్లాటకు దిగిన ఆంబోతులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 3: గోదావరిఖనిలో జనం రద్దీ ఉండే ప్రదేశంలోనే ఎద్దులు పొట్లాటకు దిగుతుండడంతో అమాయకుల కాళ్లు, చేతులు విరుగుతున్నాయి. శనివారం నిత్యం రద్దీగా ఉండే గోదావరిఖని లక్ష్మీనగర్‌లో గంట పాటు ఆంబోతులు కొట్లాటకు దిగడంతో రెండు ఎలక్ట్రికల్ షాపులు, ఓ టీవీ షోరూమ్‌లో వస్తువులు, రోడ్లపై ఉన్న పలు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ప్రజలపై ఆంబోతులు దూసుకురావడంతో పరుగులు తీశారు. అక్కడ ఉన్న వారు వాటిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నం చేసినప్పటికీ అవి ఎంతకూ అక్కడి నుంచి వెళ్లిపోలేదు. ఓ టీషాపులోకి దూరి టీవీలను, ఫ్రిజ్‌లను ధ్వంసం చేశాయి. పశువుల భారి నుంచి కాపాడాలని ఎన్నిసార్లు కార్పొరేషన్ అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదని వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఏదో ఒక చోట పశువులు కొట్లాటకు దిగుతుండడంతో పలువురి కాళ్లు చేతులు కూడా విరిగిపోయిన ఘటనలు గోదావరిఖనిలో ఉన్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవాలని ప్రజలు, వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయంపై ఏసీబీ దాడి

- అధికారులకు చిక్కిన తహసీల్దార్, డ్రైవర్, తాత్కాలిక ఉద్యోగి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 3: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. తహసీల్దార్ జాహెద్‌పాషాతో పాటు లంచం తీసుకుంటుండగా పట్టుబడిన డ్రైవర్ మహమ్మద్ అమ్జద్‌పాషా, తాత్కాలిక ఉద్యోగి దాసరి ధర్మేందర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఓదెల మండలం చిన్నకొమిరె గ్రామానికి చెందిన కడెం తిరుపతికి కాల్వశ్రీరాంపూర్ మండలం పందిళ్ల గ్రామ శివారు సర్వే నంబర్ 645లో 28గుంటల భూమి ఉంది. బ్యాంకు లోన్ కోసం పహాణి నకల్ అవసరం కావడంతో రూ.10 వేలు ఇవ్వాలని తహసీల్దార్ డిమాండ్ చేశాడు. ఈ విషయమై తిరుపతి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగి దాసరి ధర్మేందర్, డ్రైవర్ అమ్జద్‌పాషా తిరుపతి నుంచి రూ. 10 వేలు తీసుకుంటుండగా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. దాసరి ధర్మేందర్‌తో పాటు తహసీల్దార్ జహెద్‌పాషా, డ్రైవర్ మహమ్మద్ అమ్జద్‌పాషాలను అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు. తిరుపతి తండ్రి



ఏసీబీకి చిక్కిన దాసరి ధర్మేందర్, తహసీల్దార్ జాహెద్‌పాషా, అమ్జద్‌పాషా

పేరు మీద ఉన్న భూమిని విరాసత్ చేసేందుకు దాసరి ధర్మేందర్, అమ్జద్ పాషాల ద్వారా రూ.50వేలు లంచం తీసుకున్న తహసీల్దార్ జాహెద్‌పాషా గత నెల 23న మ్యుటేషన్ చేశాడని తెలిపారు. ఇటీవల మ్యుటేషన్ కావడంతో బ్యాంకు లోన్ కోసం డాక్యుమెంట్లు, పహాణి నకలు మ్యాన్యువల్‌గా ఇవ్వాల్సి ఉన్నందున తహసీల్దార్ లంచం డిమాండ్ చేశాడన్నారు. దాసరి ధర్మేందర్, అమ్జద్‌పాషాల వాంగ్మూలం మేరకు తహసీల్దార్‌నుఅరెస్టు చేశామని తెలిపారు.

పాముకాటుతో ఒకరి మృతి

గన్నేరువరం, ఆగస్టు 3, మండలంలోని పారువెల్ల గ్రామానికి చెందిన గోకులకొండ రాజేశం(68) శుక్రవారం మధ్యాహ్నం తన ఇంటి వద్ద పాముకాటుకు గురై కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు. మృతుడి కుమారుడు తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

గన్నేరువరం, ఆగస్టు 3: మండలంలోని చీమలకుంటపల్లి గ్రామానికి చెందిన పొలవేని వీరయ్య(78) అనారోగ్యం కారణంగా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం. మృతుడు గతంలో చెట్టుపై నుంచి పడి వెన్నుముఖకు దెబ్బ తగలడంతో అనారోగ్యానికి గురై ఇంట్లోనే ఉంటున్నాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో మనస్థాపానికి గురైన వీరయ్య శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

చిరుత దాడిలో రెండు ఆవులు మృతి

గంబీరావుపేట, ఆగస్ట్ 3 : గంబీరావుపేట మండలం గోరంటాల గ్రామ సమీప అడవుల్లోరి మెట్టె ఒర్రె ప్రాంతంలో శుక్రవారం రాత్రి రెండు ఆవులపై చిరుత పులి దాడి చేసింది. గోరంటాలకు చెందిన చంద్రం అనే రైతుకు చెందిన రెండు ఆవులను తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న కొట్టంలో కట్టేశాడు. శుక్రవారం రాత్రి కొట్టంలో ఉన్న రెండు ఆవులపై రుత దాడి చేసి చంపేసింది. ఉదయం ఎప్పటిలాగానే రైతు తన పొలం వద్దఉన్న కొట్టం వద్దకు వ్ప చూసే సరికి రెండు ఆవులు గాయాలతో చనిపోయి ఉన్నాయి. వెంటనే గ్రామస్తులకు చెప్పడంతో వారు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ డిప్యూటి రేంజ్ ఆఫీసర్ అంజలి, బీట్ ఆఫీసర్ రమేష్‌లు సంఘటన వద్దకు చేరుకుని పరిశీలించారు. చిరుత పులి దాడి వల్లే ఆవులు చనిపోయాయని ఫారెస్ట్ అధికారులు నిర్ధారించారు.

అడవిపిల్లి దాడిలో లేగ దూడ మృతి

చందుర్తి: మండలంలోని దేవుని తండాలో ఎర్ర చెరువు ప్రాంతంలో పశువుల పాకలో శుక్రవారం రాత్రి జంగిల్ క్యాట్ (జిత్రపులి) దాడిలో లేగ దూడ మృతి చెందింది. వట్టిమల్ల ఎఫ్ఎస్ఓ అన్వర్ హుస్సేన్ కథనం ప్రకారం.. సరిలాల్ అనే రైతు రోజు మాదిరిగానే లేగ దూడను పశువుల పాకలోకి తోలి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం పశువుల పాకకు వెళ్లి చూడగా లేగదూడ మృతి చెంది ఉన్నది. దూడ మృతి చెందిన విషయం అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దాడి చేసింది.. చిరుత పులి కాదని జంగల్ క్యాట్ (జిత్రపులి) దాడిలోనే దూడ మృతి చెందిందని తెలిపారు.

భర్త కాపురానికి తీసుకెళ్లాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న రుచిత కుటుంబ సభ్యులు, బంధువులు

కోరుట్ల రూరల్, ఆగస్టు 3: తనను కాపురానికి తీసుకెళ్లాలని మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో భర్త ఇంటి వద్ద భార్యతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన రుచితకు కోరుట్ల మండల గుమ్లాపూర్‌కు చెందిన బోయిన రమణతో 2024, ఫిబ్రవరి 14న వివాహం జరిగింది. భార్యపై అనుమానంతో రుచితను తన భర్త వేంపేటలోని పుట్టింట్లో వదిలి వెళ్లాడు. రుచిత తల్లిదండ్రులు పలు మార్లు కుల సంఘ పెద్దలతో పంచాయతీలు నిర్వహించి సముదా యించారు. దంపతులిద్దరినీ ఆసుపత్రిలో చూపించి వైద్యులతోనూ చెప్పించారు. చివరకు మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో రమణను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి రుచితను కాపురానికి తీసుకెళ్లాడానికి ఒప్పించారు. రోజులు గడుస్తున్నా కాపురానికి తీసుకెళ్లకపోవడంతో శనివారం రుచితతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో గుమ్లాపూర్‌కు తరలి వచ్చి అత్తింటి ఎదుట బైఠాయించారు. సమాచారం తెలుసుకున్న రమణ అతని కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న కోరుట్ల 2వ ఎస్ఐ ఆరీఫ్ ఖాన్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో రుచిత బంధువులు ఆందోళన విరమించారు. కాగా పోలీసుస్టేషన్‌లో రాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రేపటి నుంచి శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం

ధర్మపురి, ఆగస్టు 3: ధర్మపురి క్షేత్రంలో ఈ నెల 5న సోమవారం నుంచి శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు సుదూర ప్రాంతాల నుంచి నిత్యం అనేక మంది భక్తులు క్షేత్రానికి చేరుకుంటారు. క్షేత్రంలో లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ దేవాలయాలు, పురాతన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాలు ఉన్నాయి. క్షేత్ర సమీపంలో పురాతన శ్రీ అక్కపల్లి రాజ రాజేశ్వర స్వామి ఆలయం ఉంది. గోదావరి నదీ తీరాన గోదావరి మాత, సంతోషీమాత, పురాతన మహాలక్ష్మి, శివ సాయి బాలాజీ, శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయాలు ఉన్నాయి. శ్రావణ మాసంలో నిత్యం వివిధ ప్రాంతాల నుంచి చేరుకునే భక్తులు గోదావరిలో స్నానాలు చేసిన అనంతరం ప్రత్యేకంగా నది పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకుంటారు. నవదంపతులు జలప్రియుడు అయిన చిన్న గద్దె శివుడికి జలంతో అభిషేకం చేసి పూజిస్తారు. భక్తులు శ్రీ లక్ష్మీ నరసింహ, శ్రీ రామ లింగేశ్వర, శ్రీ అక్కపల్లి రాజ రాజేశ్వర స్వామి వారలను దర్శించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మాసంలో వచ్చే నాగుల పంచమి నాడు పాము పుట్టల్లో పాలు పోసి రాఖీ పౌర్ణమి రో జున యజ్ఞోపవీతధారణ జరిపి అనేక మంది భక్తులు శ్రీ సత్యనారా యణ స్వామి వ్రతాలు ఆచరిస్తారు. నెల రోజుల పాటు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీ లక్ష్మీ నరసింహుని ఆలయంలో పూజలు

శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ప్రధాన దేవాలయంలో స్వామి వారికి నెల రోజుల పాటు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. భక్తులు రూ.2,516 చెల్లిస్తే వారి పేరట నెల రోజుల పాటు అభిషేకం, పూజలు, సంకల్పం నిర్వహిస్తారు. ఉగ్ర నారసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, ప్రత్యేక భోగములు జరిపి రూ. 2,000 చెల్లిస్తే భక్తుల పేరట నెల రోజుల పాటు అభిషేకం, భోగములు, సంకల్పం నిర్వహిస్తారు. రామ లింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు రూ 516 చెల్లిస్తే వారి పేరట నెల రోజుల పాటు అభిషేకం నిర్వహిస్తారు.

అమెరికా ఫెలోషిప్‌నకు వీణవంక విద్యార్థిని ఎంపిక



ఫెలోషిప్‌నకు ఎంపికైన పావని

వీణవంక,ఆగస్టు3:అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించడనికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున వ్యవసాయ విద్యలో ప్రతిభావంతులైన నలుగురు విద్యార్థులను ఫెలోషిప్‌కు నలుగురిని ఎంపిక చేశారు. అందులో వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామానికి చెందిన మూల పావని ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల మాస్టర్స్ చదువులకు అయ్యే పూర్తి ఖర్చు భరిస్తుంది.ప్రతి విద్యార్థికి 55.50 లక్షల చొప్పున నలుగురికి 2.22 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను తల్లిదండ్రులను అభినందించారు. పావని కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేసింది. 2025-26 సంవత్సరంలో అమెరికాలో అబ్రమ్ యూని వర్సిటీ అలబామలో వారు మాస్టర్స్ పూర్తి చేస్తారని తెలిపారు. 2023-24, 2024-2025లలో డిగ్రీ పూర్తి చేసిన బ్యాచ్‌కు ఇద్దరు చొప్పున ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పలువురు అభినందించారు.

వ్యవసాయ కార్మిక సంక్షేమ చట్టం అమలు చేయాలి

● వ్యవసాయ కూలీలకు రూ. 12 వేల భృతి చెల్లించాలి ● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

వేములవాడ టౌన్, ఆగస్టు 3 : రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు, గ్రామీణ కూలీలకు సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలో జరుగుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను చాడ వెంకట్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు కోసం కృషి చేయాలని, అందులో భాగంగానే వ్యవసాయ కూలీలకు రూ. 12 వేల భృతి చెల్లించాలని అన్నారు. ఆసరా పెన్షన్ ఇవ్వాలని, గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి, రోజు పనిచేసే కూలీలకు రూ. 700 చెల్లించాలని, ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులతో పాటు సమ్మర్ అలవెన్స్ వెంటనే విడుదల చేయాలని, మున్సిపాలిటీలలో కూడా ఉపాధి హామీ పథకం అమలు చేయాలని అన్నారు. గ్రామాల్లో చాలా సంవత్సరాలుగా ప్రభుత్వాలు ఇళ్ల మంజూరు చేయకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మించి వున్న ఇళ్లను వెంటనే అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని అన్నారు. ప్రస్తుత పాలకులు వ్యవసాయ కూలీలకు, గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కూలీబంధు పథకం అమలు చేయాలని, ఎన్నికల గ్యారంటీలలో భాగంగా ఇళ్లు లేని పేదలకు గృహజ్యోతి పథకం కింద రూ.5 లక్షలు ఇవ్వడమే కాకుండా ఇంటి స్థలం లేని వారికి స్థలం ఇచ్చి రూ.6 లక్షలు ఇవ్వాలని కోరారు. గ్రామీణ



వేములవాడ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

ప్రాంతాల్లో వున్న సాగు భూమి లేని వ్యవసాయ కూలీలకు, గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వ భూములను పంపిణీ చేయాలని లేని పక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములు ఆక్రమణ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ శిక్షణ తరగతులలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాంతయ్య, నక్క బాలమల్లేష్, రాష్ట్ర నాయకులు కొయ్యాడ సృజన్‌కుమార్, తాటి వెంకటేశ్వర్లు, జంగయ్య, యేసు, లింగారెడ్డి, ఎగుర్ల మల్లేశం, గుంటి వేణు, కడారి రాములు తదితరులు ఉన్నారు.

నకిలీ నోట్ల ముఠా అరెస్ట్

● రూ. 7 లక్షల నకిలీ కరెన్సీ, కారు స్వాధీనం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 3 (మెట్‌పల్లి): తక్కువ మొత్తం అసలు కరెన్సీ ఇస్తే ఎక్కువ మొత్తంలో నకిలీ కరెన్సీ ఇస్తామంటూ ఎర వేసి తీరా అసలు కరెన్సీతో పారిపోయి జల్సాలకు అలవాటు పడ్డ ఆరుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వరరావు తెలిపారు. శనివారం పట్టణంలో డీఎస్పీ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా తాళ్ల ధర్మారానికి చెందిన సంజీవ్, జగిత్యాల పట్టణానికి చెందిన శివకుమార్, నిర్మల్ జిల్లాకు చెందిన కిషన్, మల్లయ్య, గంగారం, అశోక్ అనే ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 7 లక్షల నకిలీ కరెన్సీ, ఒక కారు, ద్విచక్ర వాహనం, 6 సెల్‌ఫోన్‌లు, 5,050 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముఠా సంవత్సరకాలంగా ఇద్దరు చొప్పున ఒక ముఠాగా ఏర్పడి హైద్రాబాద్‌లో ముగ్గురిని, ధర్మపురిలో ఒకరిని, కరీంనగర్‌లో ఒకరిని, జన్నారంలో ఒకరిని, జగిత్యాలలో ఒకరి వద్ద నుంచి డబ్బులు కాజేశారు. లక్ష అసలు కరెన్సీకి రూ.4 లక్షలు నకిలీ నోట్లు ఇస్తామని వల వేశారు. ఇలా వల వేసి అక్కడకు వెళ్లిన తర్వాత సదరు వ్యక్తికి బ్యాగులో 4 లక్షల వరకు నకిలీ నోట్లను చూపి అతని వద్ద ఉన్న ఒరిజినల్ లక్ష తీసుకున్న తర్వాత పరారవుతూ మోసాలకు పాల్పడేవారని తెలిపారు. ఈ వ్యవహారంలో మొత్తం 10 లక్షల వరకు నిందితులు లాక్కొని పరారీలో ఉన్నట్లు తెలిపారు. పరారీలో



మాట్లాడుతున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు

ఉన్న ముఠా సభ్యులు ఈ నెల 1న పట్టణ శివారులోని పెద్ద గుండు వద్ద స్థానిక దాబా యాజమాని వద్ద నుంచి లక్ష లాక్కొని పరారయ్యారు. యాజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి, రాజు గాలింపు చర్యలో భాగంగా శనివారం పట్టణంలోని వెంకట్రావుపేట దాబాలో గుర్తించి ఆరుగురిని అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించినట్లు తెలిపారు. నకిలీ నోట్ల ముఠాను పట్టుకోవడంలో చాకచాక్యంగా వ్యవహరించిన సీఐ నిరంజన్‌రెడ్డిని, ఎస్ఐ చిరంజీవిని, రాజు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ అభినందించారు.

పీఎం కిసాన్ జాబితా పేరిట లింకులు

● జోరుగా సైబర్ మెసేజ్‌లు

కరీంనగర్ రూరల్, ఆగస్టు3: కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్ గ్రామంలో రెండు రోజులుగా సైబర్ మోసగాళ్ల నుంచి వస్తున్న వాట్సప్ మెసేజ్‌లు చూసి కంగుతింటున్నారు. రెండు రోజుల క్రితం నగునూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి పీఎం కిసాన్ లిస్ట్1 పేరుతో ఒక వాట్సప్ మెసేజ్ వచ్చింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈ జాబితాలో తమ పేరు చూసుకోవడానికి అతడు మెసేజ్‌ను ఓపెన్ చేశాడు. అది ఓపెన్ కాక ఇన్‌స్టాల్ అడగటంతో దాన్ని ఇన్‌స్టాల్ చేశాడు. దీంతో వెంటనే ఫోన్ వాట్సప్ కనబడకుండా పోయిందని బాధితుడు తెలిపాడు. అయితే అతడికి ఫ్లిప్‌కార్ట్ నుంచి బ్యాంకుల ఫోన్ పే ఓటీపీ నంబర్ కావాలని మెసేజ్ రావడంతో అనుమానం వచ్చిన అతను ఓటీపీ ఓపెన్ చేయలేదు. కానీ అతని ఫోన్ నెంబర్ నుంచి ఇతర వ్యక్తులకు, గ్రూపునకు అతని ప్రమేయం లేకుండానే మెసేజ్‌లు పోవడం గమనించారు. విషయం తెలుసుకున్న ఆ గ్రూప్ అడ్మిన్ అతన్ని తొలగించినా గ్రూప్‌లో ఉన్న వ్యక్తులకు మెసేజ్‌లు రావడం మొదలైంది. దాదాపు ఆగ్రూప్‌లో 250మంది ఉన్నారు. మొదటగా ఆ గ్రూప్‌లో ఆ మెసేజ్ పెట్టిన వ్యక్తి పేరిట కొంతమందికి ఇంకా మెసేజ్‌లు వస్తున్నాయి. కొంత మందికి ఓటీపీలు రావడం మరికొందరికి ఫోన్లు రావడంతో గ్రామంలో పలువురు ఆందోళన చెందుతున్నారు.

రాజన్న ఆలయంలో శ్రావణమాసం ప్రత్యేక పూజలు

- సోమవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం

వేములవాడ కల్చరల్, ఆగస్టు 3: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రావణమాసం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి పెరగనున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం తాత్కాలికంగా ఆలయంలో నిర్వహించే పూజలు మార్చారని తెలిపారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి 3.15 గంటల వరకు మంగళ వాయిద్యాములు, 3.15 నుంచి 3.45 గంటల రవకు సుప్రభాతము, ఉదయం 3.45 నుంచి 4.45 వరకు సర్వ దర్శనము, 4.45 నుంచి 5 గంటల వరకు ఆలయ శుద్ధి, ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు ప్రాతఃకాల పూజ నిర్వహించనున్నారు.

● రాజన్న ఆలయంలో ఈ నెల 5వ తేదీ నుంచి సెప్టెంబరు 3వ తేదీ వరకు శ్రావణ మాస పూజలు నిర్వహించనున్నారు. 5, 12వ తేదిల్లో మొదటి, రెండో సోమవారాల్లో ఉదయం 5.30 గంటలకు శ్రీస్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 6.05 గంటలకు శ్రీస్వామి వారి కళ్యాణ మంటపములో మహాలింగార్చన జరుగును. 19వ తేదిన మూడో సోమవారం రోజున స్వామి వారికి ఉదయం 5.30 గంటలకు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 6.05 గంటలకు భీమేశ్వర స్వామి వారి ఆలయ మంటపములో ఋగ్వేదీనాం ఉపాకర్మ, యుజుర్వేదీనాం ఉపాకర్మ నిర్వహించ నున్నారు. 26వ తేదీన నాలుగో సోమవారం రోజున గోకులాష్టమి రోజున స్వామి వారికి ఉదయం 5.30 గంటలకు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభి షేకం సాయంత్రం 6.30 గంటలకు శ్రీస్వామి వారి కల్యాణ పంటపములో మహాలింగార్చన జరుగును, గోకులాష్టమి సందర్భంగా ఉదయం 6.30 గంటలకు అన్ని వైష్ణవ ఆలయాల్లో పంచోపనిషత్ ద్వారా అభిషేకము, అర్చనలు జరుగునని, ప్రదోషకాలమున భీమేశ్వర స్వామి వారి ఆలయము నందు మహాపూజ, రాత్రి 8 గంటలకు స్వామి వారి కల్యాణ మండపములో ఉట్టికొట్టుట, డోలోత్సవం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

15వ ఏషియన్ క్రిమినాలాజికల్ కాన్ఫరెన్స్‌కు ఎంపిక


మహేశ్‌గౌడ్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 3: 15వ ఏషియన్ క్రిమినాలాజికల్ కాన్ఫరెన్స్‌నకు సిరిసిల్లకు చెందిన సీనియర్ న్యాయవాది చెక్కిళ్ల మహేశ్‌గౌడ్ ఎంపికయ్యారు. ఫిలిప్పిన్స్ రాజధాని మనీలాలో ఏషియన్ క్రిమినాలోజికల్ సొసైటీ(ఏసీఎస్) అండ్ ప్రొఫెషనల్ క్రిమినాలోజిస్టు అసోసియేషన్ ఆఫ్ ది ఫిలిప్పిన్స్ సంయుక్తంగా ఈనెల 8నుంచి 10వరకు నిర్వహించే క్రిమినాలజీ, క్రిమినల్ జస్టిస్, టెక్నాలజీ అండ్ పబ్లిక్ సేఫ్టీ అనే అంశంపై జరిగే 15వ ఏషియన్ క్రిమినాలోజికల్ సొసైటీ అన్యువల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని ఆహ్వానం అం దింది. ఫోరెన్సిక్ సైన్స్ అండ్ ది రూల్ ఆన్ ఎవిడెన్స్ అనే అంశంపై మహేశ్ గౌడ్ రాసిన అబ్స్ట్రాక్ట్‌ను వారి వార్షిక జర్నల్‌లోనూ ప్రచురణకు ఎంపిక కావడ మే కాకుండా ఇదే అంశంపై సదస్సులో ప్రజంటేషన్ ఇవ్వాలని ఆహ్వానించారు. ఈ సదస్సుకు ఆసియా దేశాల నుంచి ప్రతినిధులు హాజరు అవుతారు. ఇందు లో అవకాశం రావడంతో ఎంతో అనందంగా ఉందని న్యాయవాది మహేశ్‌గౌడ్ చెప్పారు.

వస్త్ర పరిశ్రమల సంక్షోభంపై ప్రభుత్వం చిన్నచూపు

- 13వ రోజుకు చేరిన రిలే దీక్షలు


సిరిసిల్లలో రిలే దీక్షలో కూర్చున్న నేతన్నలు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 3: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూడడంతో మరమగ్గాల కార్మికులకు ఉపాధిలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న పట్టించుకునే వారే లేకుండాపోయారని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి అగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాల అధ్వర్యంలో వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సంక్షోభాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడంతోపాటు ఆసాములు, మరమగ్గాల కార్మికులకు ప్రభుత్వ ఆర్డర్లను అందించి ఉపాధిని కల్పించాలంటూ చేపట్టిన రిలే దీక్షలు శనివారంతో 13వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పంతం రవి ఆఆధారపడిన వారు ఉపాధి లేక అర్థిక ఇబ్బందులతో అత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా కార్మికులకు ఉపాధిని కల్పించకుండా రాజకీయ కక్ష సాధింపునకు నేతన్నలను బలిచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా వస్త్రపరిశ్రమల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షలో వీరబత్తిని మల్లేశం, వెల్ది నాగరాజు, అంబటి రవీందర్, సకినాల మహేష్, బింగి రమేష్, జిందం దేవదాస్, గుండేటి అనందం, సూరంపల్లి రాజు, మార్గం నరేష్ కూర్చున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

గంభీరావుపేట, ఆగస్టు 3: మండలంలోని మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన నారం బాలయ్య అనే వ్యక్తి వైద్య ఖర్చుల కోసం రూ: 2లక్షల 50 వేల ఎల్‌వోసీని కాంగ్రెస్ నాయకులు శనివారం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న బాలయ్య వైద్యానికి నోచుకోలేకపోవడంతో స్థానిక కాంగ్రెస్ నేతలు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో హమీద్ సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి విన్నవించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో కేకే మహేందర్‌రెడ్డి బాలయ్య వైద్య ఖర్చుల కోసం 2 లక్షల 50 వేల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. మంజూరైన ఎల్‌వోసీని కాంగ్రెస్ నాయకులు బాలయ్యకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, జిల్లా కార్యదర్శి రామచంద్రా రెడ్డి, రవి, సతీష్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

గంజాయి నివారణలో యువత భాగస్వాములు కావాలి

ముస్తాబాద్, అగస్టు 3: డ్రగ్స్ వినియోగంతో భవిష్యత్ అంధకారం అవుతుందని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నార్కోటిక్స్ సీఐ కృష్ణమూర్తి సూచించారు. మండలంలోని మోడల్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్యార్థులు వ్యసనాల వైపు చూడొద్దని, మత్తు పదార్థాల వినియోగం వలన భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. మత్తు పదార్థాలు వాడొద్దంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్సై గణేశ్, ప్రిన్స్‌పాల్ ఉదయ్‌రెడ్డి, అరుణ్‌కుమార్, పీసీలు రాజశేఖర్, కుమార్, దామోదర్ పాల్గొన్నారు.

పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి: ఆర్డీవో

తంగళ్లపల్లి, ఆగస్టు 3: పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని మండల ప్రత్యేక అధికారి, ఆర్డీవో రమేష్ అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పచ్చదనంతో పాటు పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. పచ్చదనం స్వచ్ఛదనం కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను, యువజన సంఘాల నాయకులను, పలు పార్టీల నాయకులను భాగస్వాములు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని కుక్కల సంఖ్య నమోదుపై ఆరా తీశారు. వీధుల్లో కుక్కలు సంచరించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని సూచించారు. కుక్కల బెడద నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో మీర్జా, పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిరుపేద గౌడ విద్యార్థుల అభ్యున్నతికి కృషి

సిరిసిల్ల, అగస్టు 3, (ఆంధ్రజ్యోతి): నిరుపేద గౌడ విద్యార్థుల అభ్యున్నతి కోసం ఎనలేని కృషిని పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ చేశాడని తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు పులి లక్ష్మీపతిగౌడ్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని బైపాస్ రోడ్డులో సర్ధార్‌సర్వాయ్ పాపన్నగౌడ్ సర్కిల్‌లో శనివారం పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించి కేక్‌ను కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండి దేవదాస్‌గౌడ్, గోపా కమిటి జిల్లా అధ్యక్షుడు కంచర్ల అమరేందర్‌గౌడ్, కందుకూరి రామాగౌడ్, కోడూరి భాస్కర్ గౌడ్, పోన్నంలక్ష్మణ్‌గౌడ్, సుద్దాల శ్రీనివాస్‌గౌడ్, బైరి శ్రీనివాస్‌గౌడ్, బండి పర్శరాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ తరానికి తీరం..జూకంటి

- పల్లెల జీవన్మరణ పోరాటాలకు గొంతై వినిపించిన కవిత్వం
- 16 సంకలనాలు... 12 అవార్డులు
- నేడు నాగుల మల్లయ్య స్మారక జాతీయ పురస్కార ప్రదానోత్సవం


జూకంటి జగన్నాథం, జగన్నాథం కవితా సంపుటాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సాహిత్యంపై చెరిగిపోని ధిక్కార స్వరం ప్రముఖ కవి జూకంటి జగన్నాథం. సరళంగా సూటిదనంగా మనుషుల్లో కదలికలను తెస్తూ తెలంగాణ పల్లె జీవన్మరణ పోరాటాలకు గొంతుగా నిలిచిన కవి, రచయిత, అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం జాతీయస్థాయి నాగుల మల్లయ్య స్మారక పురస్కారాన్ని అందుకోనున్నారు. ఆదివారం సిరిసిల్లలోని మాన్య ఫంక్షన్ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అవార్డును అందించనున్నారు. ఇటీవలే జూకంటికి తెలంగాణ ప్రభుత్వం దాశరథి కృష్ణమాచార్య అవార్డును ప్రదానం చేసింది. నాగుల మల్లయ్య పురస్కారం అందుకుంటున్న సందర్భంగా జూకంటి సాహిత్య ప్రస్థానం గురించి 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న కథనం. తెలంగాణ పల్లెలు అత్యవసర పరిస్థితుల్లో తల్లడిల్లిపోతున్న బాధలోనుంచి ప్రపంచీకరణతో గ్రామాలు కొల్లగొడుతున్న మానవ సంఘర్షణల మధ్య తన అక్షరాలతో బలమైన గొంతుకను వినిపించిన కవి, రచయిత జూకంటి. సామాజిక విప్లవాల చర్య, ప్రతి చర్యలు, బాధలు, వలసల తండ్లాటల మధ్య అక్షర పిడికిలిని బిగించిన జగన్నాథం తెలంగాణ ఉద్యమంలో తనదైన పాత్రను పోషిస్తూ రచనలను అందించారు. తెలంగాణ అంతటా కని పించే బీభత్సం, విషాదం, హృదయ విదారకర దృశ్యాలే కాక రాజకీయాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను అందించారు.

జూకంటికి లభించిన అవార్డులు

- 1986లో వలసకథకు 'ఆంధ్రజ్యోతి' కథల పోటీల్లో బహుమతి
- 1998లో సినారె కవిత పురస్కారం
- 2000లో నూతనపాటి గంగాధర పురస్కారం
- 2000లో ఫ్రీవర్స్ ఫ్రంట్ పురస్కారం
- 2004లో గరికపాటి పురస్కారం
- 2002లో తెలుగు యూనివర్సిటీ అవార్డు
- 2008లో రాచకొండ విశ్వనాథ శాస్త్రి కథా పురస్కారం
- 2011లో తెలుగు యూనివర్సిటీ ప్రతిభా పురస్కారం
- 2015లో తెలంగాణ ఉత్తమ సాహిత్య పురస్కారం
- 2020లో పోట్లపల్లి రామారావు జీవిత సాఫల్య పురస్కారం
- 2020లో డాక్టర్ సినారె జాతీయ కవితా పురస్కారం
- 2024లో తెలంగాణ ప్రభుత్వంచే దాశరథి పురస్కారం

ఐదు దశాబ్దాలుగా అక్షర ప్రవాహం...

సిరిసిల్ల మానేరు వాగు నీటి సవ్వడిలోనే అక్షర ప్రవాహాన్ని జూకంటి సాగించారు. 1955లో రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఊపిరి పోసుకున్న జూకంటి తమ తల్లిదండ్రుల కులవృత్తి నూనె తీసే పనిలో నుంచి అక్షర జ్ఞానంవైపు వెళ్లారు. అమ్మమ్మ ఊరిలో 7వ తరగతి వరకు, శనిగరంలో పదోతరగతి వరకు చదువుకున్న జూకంటి హరికథలు, పటం కథలు, చిరుతల రామాయణం, కోలాటం, వరికోతల సమయంలో వినిపించే అనేక సాహిత్య ప్రక్రియలు జూకంటిని ఆకర్షించాయి. సిరిసిల్లలో సాహిత్య ప్రక్రియ 1970 నుంచి మొదలైంది. 1970లో 'ఆంధ్రజ్యోతి' వీక్లీలో మొదటి కవితతో మొదలైన ప్రస్థానం ఐదు దశాబ్దాలుగా నిరాటంకంగా సాగుతూనే ఉంది. ప్రధానంగా గ్లోబలైజేషన్, ప్రపంచం మారుతున్న తీరు, ఎమర్జెన్సీ వంటి అనేక అంశాలపై జూకంటి బలమైన గొంతుకనే వినిపించారు. తన సాహిత్య ప్రస్థానంలో ఎన్నో అవార్డులు, సంకలనాలను అందించారు. జూకంటి జగన్నాథం కవితలు కన్నడ, తమిళ, హిందీ, ఇంగ్లీష్ భాషలో అనువదించారు. సాహిత్యంతో పాటు సాహిత్య కార్యక్రమాలు ముందుకు తీసుకవెళ్లడంలో ముఖ్య పాత్ర వహించారు. 2007 నుంచి 2013 వరకు తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడిగా ఉన్నారు. 2012 లో దక్షిణ భారత కవి సమ్మేళనంలో, 2019లో అస్సాంలో కేంద్ర సాహిత్య అకాడమీ అఖిల భారత కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. 2019 లో కేంద్ర సాహిత్య అకాడమీ జ్యూరీ సభ్యుడిగా వ్యవహరించారు. 2014 నుంచి అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడిగా కొన సాగుతున్నారు. సిరిసిల్లలో నయనం ప్రచురణల సంస్థను స్థాపించి ఎన్నో కథల పుస్తకాలను వెలువరించారు.

జూకంటికి అభినందనలు...

సిరిసిల్లకు చెందిన ప్రముఖ కవి, రచయిత జూకంటి జగన్నాథంకు నాగుల మల్లయ్య జాతీయ స్మారక పురస్కారం అందుకోనున్న సందర్భంలో మానేరు రచయితల సంఘం అభినందనలు తెలియజేసింది. శనివారం సిరిసిల్లలో మారసం సమావేశమై జూకంటి రాసిన సాహిత్యాన్ని మననం చేసుకున్నారు. ఈ సమావేశంలో మారసం ప్రతినిధులు ఎలగొండ రవి, అడెపు లక్ష్మణ్, టి వి నారాయణ, బూర దేవానందం, చిటికెన కిరణ్, అంకారపు రవి, గుండెల్లి వంశీ, జిందం అశోక్, ఈడెపు సౌమ్య తదితరులు అభినందనలు తెలిపారు.

తల్లిపాలతో బిడ్డకు ఎంతో మేలు

సిరిసిల్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం సిరిసిల్ల ఐసీడీఎస్ పరిధిలో అంబేద్కర్‌నగర్ సెక్టార్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిశువుకు పాలు పట్టించడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. అన్నప్రాసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, అయాలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తల్లిపాలపై తల్లులకు అవగాహన కల్పించారు. తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: తల్లిపాలు పుట్టిన బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని అంగన్‌వాడీ టీచర్లు మల్లీశ్వరి, రాధిక, పద్మ అన్నారు. మండలంలోని వన్‌పల్లి, శాంతినగర్, కేలోత్ తండా అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అనంతరం ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు మంజుల, ఇందిర, ఆశా వర్కర్లు ప్రేమలత, స్వప్న, సరిత, తదితరులు పాల్గొన్నారు.


సిరిసిల్లలో అన్నప్రాసన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

చందుర్తి: చందుర్తి మండలం బండపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యాన్ని గర్భవతులకు, బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఐశ్వర్య, పుష్ప, రాధిక, నవ్య జ్యోతి, పంచాయతీ కార్యదర్శులు రమేష్ బాబు, కళాజ్యోతి, అంగన్వాడి టీచర్లు న్యాత పద్మ, బుర్ర రేణుక గసికంటి రేణుక, శోభ, అనిత ఆశా కార్యకర్తలు వసంత, రమణ, స్రవంతి, గంగజల, మానస పాల్గొన్నారు.

అటవీ సిబ్బందికి గిరిజనుడికి మధ్య వాగ్వాదం

వీర్నపల్లి, ఆగస్టు 3: మండలంలోని రాశిగుట్ట తండాలో అటవీ ప్రాంతంలోని పంట చేనులోకి ట్రాక్టర్ తీసుకెళ్తుండగా ప్లాంటేషన్ మొక్కలు ధ్వంసం కావడంతో అటవీ సిబ్బందికి, గిరిజనుడికి మధ్య వాగ్వాదం జరిగింది. తండాకు చెందిన గిరిజన రైతు రమావత్ లింగం అటవీ ప్రాంతంలోని రోడ్డు వెంబడి ట్రాక్టర్ తీసుకొని వెళ్తుండగా అదే ప్రాంతంలో ప్లాంటేషన్ చేసిన మొక్కలు ధ్వంసమయ్యాయి. గమనించిన బేస్ క్యాంపు సిబ్బంది ప్లాంటేషన్ ప్రదేశంలోకి ట్రాక్టర్ ఎందుకు తీసుకొచ్చావని అడగడంతో రైతు అక్కడున్న సిబ్బందిని ఇష్టం వచ్చినట్లు తిడుతూ తోసుకోవడంతో కొద్దిసేపు వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

విషయం తెలుసుకున్న ఫారెస్ట్ సెక్షన్ అధికారులు పద్మలత, సక్కారం ఇద్దరిని కార్యాలయానికి పిలి పించుకొని జరిగిన విషయాన్ని అడుగగా పొరపాటున ట్రాక్టర్‌తో మొక్కలు ధ్వంసమయ్యాయని రైతు తెలిపాడు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కావద్దని, సిబ్బందితో దురుసుగా ప్రవర్తించొద్దని అధికారులు రైతును హెచ్చరించారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

జిల్లా గ్రంథాలయానికి స్టడీ మెటీరియల్ అందజేత


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న బీఎస్‌రావు తదితరులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 3: ఉద్యోగ పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యే వారికి అవసరమయ్యే స్టడీ మెటీరీయల్‌ను బీఎస్ రావు ట్రస్ట్ నుంచి అందిస్తున్నామని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు అన్నారు. సిరిసిల్ల జిల్లా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరీయల్ పుస్తకాలను గ్రంథాలయ సంస్థకు అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్ రావు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఉపయోగపడేలా ట్రస్ట్ నుంచి స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నామని ఇప్పటి వరకు కుమరంభీం ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు అనేక జిల్లాల్లో అందించామన్నారు. పరీక్షలకు సిద్ధమవుతున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అకునూరి శంకరయ్య, కౌన్సిలర్లు పత్తిపాక పద్మ, గుండ్లపల్లి నీరజపూర్ణచందర్, నిర్వాహకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట, ఆగస్టు 3: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజగోపాల్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను శనివారం తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతీ గ్రామంలో ఫీవర్ సర్వేలు జాగ్రత్తగా చేయాలని ఆదేశించారు. వ్యాధుల పట్ల ఫీల్డ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వేణు మాధవ్, సిహెచ్‌వో బాలచందర్, కృష్ణమూర్తి, సూపర్‌వైజర్ రషీద్, ఫార్మాసిస్టు సతీష్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి


బండి సంజయ్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి, ఆగస్టు 3: ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు తంగళ్లపల్లి మండల బీజేపీ శ్రేణులు వినతిపత్రం సమర్పించారు. కరీంనగర్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు శనివారం కలిసి వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ హయాంలో తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి శివారులో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించి చుట్టూ ప్రహరీ గోడ సైతం నిర్మించి వదిలేశారని పేర్కొన్నారు. నాలుగు జిల్లాల బీడీ కార్మిక లకు ఉపయోగపడే ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో బీడీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈఎస్ఐ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు కాళీచరణ్, ఇటిక్యాల రాజు, కోడం భవిత, బొల్లం భాస్కర్‌గౌడ్ ఉన్నారు.

గంభీరావుపేట: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కరీంనగర్‌లోని తన నివాసంలో గంభీరావుపేటకు చెందిన పలు కుల సంఘాల నాయకులు శనివారం కలిసారు. బండి సంజయ్ కరీంనగర్‌కు వచ్చిన సంధర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు గంట అశోక్ సహకారంతో గంభీరావుపేట నుంచి పలు కుల సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బండి సంజయ్‌ను శాలువాతో సన్మానించి వారి అభిమానాన్ని చాటారు. బండి సంజయ్‌ను కలిసిన వారిలో రజక సంఘం, శాలివాహన సంఘం, కుమ్మరీ సంఘం, శ్రీ కృష్ణ యాదవ సంఘం, గౌడ సంఘం, ముదిరాజ్ సంఘం, మున్నూరు కాపు సంఘం, దళిత సంఘం, స్వర్ణకార సంఘాల నాయకులు ఉన్నారు. తమ సంఘాల అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని బండి సంజయ్‌ను కుల సంఘాల నాయకులను కోరారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 3: ప్రజలు తపాలా శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగపర్చుకోవాలని సిరిసిల్ల సబ్ డివిజన్ మెయిల్ ఓవర్సీర్ సాయిరాం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో తపాలా సేవలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారి సాయిరాం మాట్లాడుతూ ప్రజలు డబ్బును పొదుపు చేయడం వల్ల భవిష్యత్తులో ఉపయోగపడుతాయని అన్నారు. తపాలా శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను వివరించారు. ప్రతి ఇంటికి తపాలా బీమా అనే లక్ష్యంతో కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం సేవలకు సంబంధించిన కర పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కిషన్‌దాస్‌పేట మెయిల్ ఓవర్సీర్ రాజు, పంచాయతీ కార్యదర్శి మహేందర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, తపాలా సిబ్బంది రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కుంకుమార్చనలు

సిరిసిల్ల రూరల్, అగస్టు 3: సిరిసిల్ల పట్టణంలో శ్రీహరిహరపుత్రఅయ్యప్ప స్వామి దేవాలయంలో చేపట్టిన కోటి 8 లక్షల కుంకుమార్చనలు రెండవ రోజు శనివారం కన్నుల పండువగా సాగాయి. అయ్యప్ప స్వామి అలయంలోని శ్రీరాజశ్యామల, శ్రీవారాహిసహిత శ్రీలలితా త్రిపుర సుందరీ, అష్టలక్ష్మీ సహితశ్రీలక్ష్మీనారాయణ దేవాలయాల 3వ వార్షికోత్సవం సందర్భరంగా అలయకమిటీ అధ్యక్షుడు రాచ విద్యాసాగర్ గురుస్వామి అధ్వర్యంలో అలయంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలను చేపట్టి లలితా త్రిపుర సుందరి అమ్మవారికి పసుపు కోమ్ములతో అలంకరణలతో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అలయంలో మహిళలు పసుపు రంగు చీరలను ధరించి కుంకుమార్చనలు చేశారు. ఆదివారం అమ్మవారికి 108 చీరలతో అలంకరించి కుంకుమార్చనలో పాల్గొనే మహిళలు అకుపచ్చ రంగు రాజశ్యామల కుంకుమపూజకు కట్టుకోని రావాలని అలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రమేష్‌పంతులు, చేపూరి నాగరాజు, గుండ్లపల్లి శ్రీనివాస్, ప్రయాకర్‌రావు మధుసూధన్, గడ్డం భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహమేరా జీవితం..

- మార్కెట్లోకి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్... బహుమతులు
- ప్రత్యేక పార్టీలకు సిద్ధమవుతున్న యువత
- నేడు ఫ్రెండ్‌షిప్ డే

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఆత్మీయత ఏదైనా ఉందంటే అది స్నేహమే... జీవితంలో ఎదురయ్యే ఎన్నో అనుభూతులు ఎన్నెన్నో కష్టాలు ఏదీ దాచుకోకుండా చెప్పుకునే దగ్గరి బంధం ప్రాణస్నేహితుల మధ్య ఉంటుంది. స్నేహానికి మించిన బంధం ఈ లోకాన లేదనే చెప్పుకోవచ్చు. రక్త సంబంధికులతో ముడిబడిన బంధాలకంటే ఎలాంటి బంధుత్వం లేక పోయినా జీవితాంతం తోడు నీడగా ఆప్యాయత అనురాగాలు పంచే బంధం స్నేహం. అనుక్షణం తపించే స్నేహానికి అవధులు ఉండవు. ఈ స్నేహితుల దినోత్సవాన్ని ఆనందంగా గడుపుకోవడానికి మిత్రులకు చిరకాలం గుర్తుండే విధంగా జ్ఞాపికలు ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. గ్రీటింగులు, గిఫ్ట్ ఆర్టికల్స్ కూడా మార్కెట్‌లోకి వచ్చాయి. బ్రాస్‌లేట్లు, రింగులు, బ్యాండ్స్ ఎంతో ఆకర్షణీయంగా స్నేహితులను ఆకట్టుకుంటున్నాయి.

● అండగా నిలుస్తున్న స్నేహితులు..

ఫెస్‌బుక్, ఎక్స్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, ఇతర యాప్‌ల ద్వారా లైక్‌లు కొట్టడం, కామెంట్లు చేయడమే కాకుండా సామాజిక మాధ్యమాల ద్వారా కూడా కొంతమంది స్నేహితులు ఒక బృందంగా ఏర్పడి ఎంతో మందికి సహాయాన్ని అందిస్తూ ప్రశంసలను అందుకుంటున్నారు. ఒకరికిఒకరు అండగా నిలుస్తున్నారు. చదువులు పూర్తిచేసి ఉద్యోగాలు చేస్తున్నవారు చదువుకుంటున్న విద్యార్థులు సైతం ఫౌండేషన్‌లుగా ఏర్పడి చదువులు మానేసిన విద్యార్థులకు చదువులను, ఖరీదైన వైద్యం పొందలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నవారికి సహాయాన్ని అందిస్తున్నారు. చిన్ననాటి మిత్రులందరు కలిసి తాము అక్షరాలు దిద్దుకున్న ఊళ్లో పాఠశాలలను బాగు చేస్తున్నారు. స్నేహమంటే ఇది అంటూ యువత కొత్తనిర్వచనాన్ని అందిస్తున్నారు.



● ఫ్రెండ్‌షిప్ డే నేపథ్యం..

బంధువులు బలవంతంగా ఏర్పడుతారు. స్నేహితులు స్వేచ్ఛగా అల్లుకుపోతారు. ఈ బంధాన్ని మరింత పెంచడం కోసం హాల్‌మార్క్ గ్రీటింగ్ కార్డు వ్యవస్థాపకుడు జోయేస్ హాల్ మొదటిసారిగా 1919లో స్నేహితుల దినోత్సవాన్ని ప్రారంభించారు. ఆగస్టు మొదటి ఆదివారం రోజున గ్రీటింగ్ కార్డులు స్నేహితులకు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పుకోవడం మొదలైంది. ఆ తరువాత 1940నాటికి బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

సంక్షిప్త సమాచారం..

కోనరావుపేట: మధ్యాహ్న భోజన నిర్వాహకుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఐద్వా జిల్లా మహిళా సంఘం కార్యదర్శి జవాజి విమల డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను అమలు చేయాలని కోరుతూ తహసిల్దార్ విజయ ప్రకాష్‌రావుకు శనివారం వినతి పత్రం అందజేశారు.

- వాహనదారులు ధ్రువపత్రాలు కలిగి ఉండాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని కోనరావుపేట ఎస్సై రాజశేఖర్ రెడ్డి అన్నారు. కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో శనివారం మండల ఆటో యూనియన్ సభ్యులతో ట్రాఫిక్ నిబంధనలపై పలు సూచనలు ఇచ్చారు.

- కోనరావుపేట మండలం మల్కపేటలో రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులు, కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

- కోనరావుపేట మండలం మంగళపల్లికి గ్రామానికి చెందిన నంది సత్తయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రూ. 5000 ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని అందజేశారు.

చందుర్తి: మండలంలోని ఎనగల్‌కు చెందిన రాజిరెడ్డి అనే లబ్ధిదారుడికి కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలోని విద్యార్థులు స్వచ్ఛత పనులను చేపట్టారు. ఆవరణలోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు.

తంగళ్లపల్లి: మండలంలోని గోపాలరావుపల్లిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బొల్లారం చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాలలో మైసమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగాకురువాలని గ్రామస్థులు గ్రామశివారులో ఉన్న చిత్తరుగుట్ట మైసమ్మ తల్లితోపాటు నరసింహాస్వామికి గొర్రె పొట్టేళ్లతో బోనాలు తీశారు.

గంభీరావుపేట: అసిస్టెంట్ ఎగ్జుకూటీవ్ ఇంజనీర్‌గా సెలక్ట్ అయిన గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన వీరబత్తిని దివ్యను విద్య బోధించిన ఉపాధ్యాయులు అభినందించారు. కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 2016లో ఎస్ఎస్‌సీ చదివి 9.7 జిపిఏ సాదించింది.